క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జాస్మిన్‌కుమారి

కవిటి: బాలికలు, మహిళలకు చట్టాలపై అవగాహన అవసరమని గెస్ట్ చైల్డ్‌లైన్ సూపర్‌వైజర్ జాస్మిన్‌కుమారి అన్నారు. మండలంలోని మాణిక్యపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం తెరుకోటి కృష్ణారావు అధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిరోధక చట్టం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గెస్ట్ సిబ్బంది ప్రసాద్‌బిసాయి, బెందాళం వకీలు కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

'సద్వినియోగం చేసుకోవాలి'



టీఎల్‌ఎం సామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

కవిటి: ప్రభుత్వం మంజూరు చేసిన స్కూల్ కాంప్లెక్స్ గ్రాంటు కింద రూ.20,000ల వ్యయంతో కొనుగోలు చేసిన విద్యా, క్రీడా సామగ్రిని అన్ని పాఠశాలల్లోనూ సద్వినియోగం చేసుకోవాలని బొరివంక స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ సనపల రామకృష్ణ సూచించారు. ఈ మేరకు కాంప్లెక్స్ పరిధిలోని 16 పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలకు సామగ్రిని సోమవారం పంపిణీ చేశారు. ప్రభుత్వం ఆశించిన లక్ష్యాలను సాధించాలన్నారు.

35 మందికి కంటి పరీక్షలు



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కంచిలి: మండలంలోని నువాగడ పంచాయతీ పరిధి నువాగడ కాలనీలో హెల్పేజ్ ఇండియా సౌజన్యంతో సోంపేట ఆరోగ్యవరం కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. దీనిలో భాగంగా 35 మందికి కంటి పరీక్షలను నేత్ర వైద్య సహాయకుడు వి.కిరణ్ నిర్వహించారు. ఏడుగురికి కళ్లద్దాలు అవసరమని, మరో ఆరుగురికి మందులు పంపిణీ చేశారు. 9 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. శిబిరాన్ని స్థానిక సర్పంచ్ సబితా గొమాంగో ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్‌తో నాయకత్వ లక్షణాలు



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు

టెక్కలి: ఎన్‌ఎస్‌ఎస్‌తో విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు వస్తాయని టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు అన్నారు. కళాశాల విద్యార్థులు నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా సోమవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెహ్రూ యువకేంద్రం సహకారంతో నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా కేచ్‌ది రైన్, స్వచ్ఛత-పరిశుభ్రత, యోగా తదితర అంశాలపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. సమాజ హితవుకు ఉపయోగపడే ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డి.విష్ణుమూర్తి, పీవో బి.బలరాం తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛావతి ఉత్సవాలకు శుభరాట



శుభరాట వేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవాలకు సోమవారం శుభరాట వేశారు. ఉత్సవాల నిమిత్తం ఒడిశాలోని కురాసిని అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి తీసుకొచ్చిన శుభరాటను సురంగి రాజావారి కోట వద్ద ఉంచి, పురోహితుల అధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఉత్సవ శుభరాటను ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజానికి కృషి



ఇచ్ఛాపురం రూరల్: మాట్లాడుతున్న ఏసీడీపీవో లావణ్య

కవిటి: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తోందని పలువురు పేర్కొన్నారు. మండలంలోని రాజపురం, మాణిక్యపురం అంగన్‌వాడీ సెక్టార్ల పరిధిలో పోషణ్ పక్వాడా పక్షోత్సవాలను సోమవారం నిర్వహించారు. దీనిలో భాగంగా పోషకాలతో కూడిన ఆహార పదార్థాల ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమాల్లో రాజపురం, బెజ్జిపుట్టుగ, దూగానపుట్టుగ సర్పంచ్‌లు సనపల జానకిరావు, ఎస్వీ నారాయణస్వామి, దూగాన భద్రాచలం, రాజపురం ఎంపీటీసీ సనపల కృష్ణారావు, ఏసీడీపీవో లావణ్య, సూపర్‌వైజర్ పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీవో డి.శార్వాణి, సర్పంచ్ ధర్మారావు అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని రెయ్యిపాడులో పోషణ వేడుక కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ మద్దిల హరినారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సంతోషి, శిరీషా తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలు వినియోగించండి

నందిగాం: పోషకాహార లోపం నిర్మూలనకు చిరుధాన్యాలను వినియోగించాలని ఎంపీడీవో హెచ్‌వీ రమణమూర్తి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు పోషకాహార ప్రాధాన్యతపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. పోషకాహార లోప నివారణకు అరికెలు, కొర్రలు, సజ్జలు, రాగులు, సామలు, ఊదలు, వరిగెలు, జొన్నలతో తయారు చేసిన ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వై.హరిబాబు, పద్మావతి, రాము తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, చిన్నారుల రక్తహీనత, పోషణ లోపాన్ని గుర్తించి వాటిని నివారించేందుకు కార్యకర్తలు చర్యలు తీసుకోవాలని ఏసీడీపీవో వై.లావణ్య సూచించారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ.. అంగన్‌వాడీల్లో అందించే పోషకాహారాన్ని విధిగా అందజేయాలని సూచించారు. సమావేశంలో సీనియర్ సూపర్‌వైజర్లు ఆర్.నీలవేణి, జయలక్ష్మి పాల్గొన్నారు.



నందిగాం: మాట్లాడుతున్న ఎంపీడీవో రమణమూర్తి



వజ్రపుకొత్తూరు రూరల్: మాట్లాడుతున్న సర్పంచ్ ధర్మారావు



కవిటి: రాజపురంలో పోషక పదార్థాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

సబ్ కలెక్టర్ స్పందనకు 13 వినతులు



వినతులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

టెక్కలి: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 13 వినతులు వచ్చాయని అధికారులు తెలియజేశారు. సంతబొమ్మాళి మండలం ఎస్‌బీ కొత్తూరుకు చెందిన రేషన్ డీలర్ రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ అధికారులకు పట్టుబడినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని, ఈ విషయంలో దిగువ స్థాయి అధికారులు తాత్సారం చేస్తున్నారని జగన్నాథపురం సర్పంచ్ జోగి రాములమ్మతో పాటు గ్రామస్తులంతా ఫిర్యాదు చేశారు. అలాగే కోటబొమ్మాళి మండలం విశ్వనాథపురం పంచాయతీ సింహాద్రిపురం గ్రామంలో ఎర్ర చెరువు ఆక్రమణను అడ్డుకోవాలని సర్పంచ్ ప్రభావతి కోరారు. ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన తమకు నష్ట పరిహారం అందజేయాలని మెళియాపుట్టి మండలం దీనబంధుపురం గ్రామానికి చెందిన హరిపురం పున్నయ్య విన్నవించారు. తన తండ్రి మరణించిన తర్వాత రేషన్ కార్డులో తండ్రికి బదులు తన పేరును తొలగించారని దీనిపై పలు మార్లు అధికారులను విన్నవించినా పట్టించుకోవడం లేదని సంతబొమ్మాళి మండలం పోతునాయుడుపేట గ్రామానికి చెందిన గిన్ని మధు ఫిర్యాదు చేశారు.

మండల స్థాయిలో సమీక్షలు

ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు, స్పందన వినతుల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాలపై డివిజన్ పరిధిలో మండల స్థాయిలో శాఖల వారీగా సమీక్షలు నిర్వహిస్తానని సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. దీనికి సంబంధించి మండల స్థాయిలో అన్ని వివరాలతో అధికారులు హాజరవ్వాలని స్పష్టం చేశారు. అలాగే పత్రికల్లో వస్తున్న కథనాలపై స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. రానున్న వేసవిలో గ్రామ స్థాయిలో మంచినీరు, విద్యుత్ సమస్యలు, వైద్య సదుపాయంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేశాం

- అధికారుల సేవలు అభినందనీయం
- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: రైతులకు అనుకూలంగా ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానంతో నియోజకవర్గంలో అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో వ్యవసాయాధికారులతో సమీక్ష సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు ప్రక్రియ విషయంలో అధికారుల తీరు అభినందనీయమన్నారు. గతంలో కేవలం 88 వేల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేసేవారని, అంతేకాకుండా దళారీల బారినపడి రైతులంతా ఎంతో నష్టపోయేవారని గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన నూతన విధానంతో దళారీల బెడద లేకుండా మద్దతు ధరతో నియోజకవర్గంలో 1 లక్షా 9 వేల టన్నులపైగా ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలియజేశారు. ప్రభుత్వం అమలు చేసిన జీఎల్‌టీ ప్రక్రియ రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. అలాగే నియోజకవర్గంలో అవసరమైన రైతు సంఘాలకు వ్యవసాయ యంత్రాలు అందజేయాలని సూచించారు. నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు చేయలేదంటూ ప్రతిపక్ష టీడీపీ నాయకుడు అచ్చెన్నాయుడు లేనిపోని విమర్శలు చేశారని, ఆ విమర్శలను తిప్పికొట్టే విధంగా అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేశామని తెలియజేశారు. సమావేశంలో ఏడీ బీవీ తిరుమలరావు, వ్యవసాయాధికారులు రంగారావు, గోవిందరావు, శ్రీలక్ష్మి, శ్రీకాంత్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

వేలంపాట ఖరారు



వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలో వీధి గుత్తలు, రోజువారీ బజారులో ఆశీల వసూలుకు నిర్వహించిన వేలంపాట ఖరారైంది. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కమిషనర్ ఎన్.రమేష్ అధ్వర్యంలో 2023-24 సంవత్సరానికి సంబంధించిన వేలంపాటలో 9 మంది పాల్గొన్నారు. ప్రభుత్వం పాట రూ.16 లక్షలతో ప్రారంభమై పిట్ట బైరాగి, దాట్ల నూకమ్మ, తిప్పన రవణల మధ్య హోరాహోరీగా సాగింది. వేలంపాటను రూ.28.90 లక్షలకు పిట్ట బైరాగి సొంతం చేసుకొన్నారు. దీంతో గతేడాది కంటే మున్సిపాలిటీకి రూ.6.73 లక్షల అదనపు ఆదాయం చేకూరింది. వీటితో పాటు కమేళా వేలంపాటను రూ.1.55 లక్షలకు, లైబ్రరీలోని పాత పేపర్లను రూ.65,200లకు సొంతం చేసుకున్నారు. అలాగే కొబ్బరి చెట్ల ఫలసాయంను దక్కత విశ్వేశ్వరావు రూ.3,550 లకు సొంతం చేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ డి.హరిమోహన్, ఆర్ఐ అమర్, సిబ్బంది పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ మృతి తీరనిలోటు



మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు:

మాజీ ఎంపీటీసీ, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు తోట సత్యనారాయణ మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటని మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని పాతటెక్కలిలో తోట సత్యనారాయణ సంతాప సభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ ప్రస్థానంలో మచ్చలేని నాయకుడిగా సత్యనారాయణ సేవలు అందించారని కొనియాడారు. కుటుంబ బాధ్యతలను మోస్తూనే ప్రజలకు, పార్టీకి చేసిన సేవలు మరువలేనివన్నారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనివాసరావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, మండల అధ్యక్షుడు పి.గురయ్యనాయుడు, సర్పంచ్ టి.సుశీల, ఎంపీటీసీ సభ్యుడు బాలక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక స్పందన

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గంలో నెలకొన్న భూ సమస్యలపై ఉన్నతాధికారుల సమక్షంలో పరిష్కారానికి ప్రత్యేక స్పందన కార్యక్రమం ఈనెల 29న మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు మంత్రి క్యాంప్ కార్యాలయం నుంచి సోమవారం ఒక ప్రకటన విడుదలైంది. స్పందన కార్యక్రమంలో కలెక్టర్, పలాస ఆర్డీవో, మూడు మండలాల తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొంటారని తెలియజేశారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

29న ఇంటర్వ్యూలు

కోటబొమ్మాళి: స్థానిక మేజర్ పంచాయతీలో ఖాళీగానున్న ప్రకాష్‌నగర్‌కాలనీ(కోటబొమ్మాళి-2) అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త పోస్టుకు ఈనెల 29న టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ పీవో హైమావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరవ్వాలని సూచించారు.

తీర్మానం వెనక్కి తీసుకోవాలి

కాశీబుగ్గ: అసెంబ్లీలో దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు కల్పించాలని ప్రవేశపెట్టిన తీర్మానాన్ని విశ్వహిందూ పరిషత్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పలాస విశ్వహిందూ పరిషత్ శాఖ సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు తహసీల్దార్ స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సభ్యులు ఇప్పిలి ఏకాహం, కొంచాడ రాజాశ్రీకాంత్, అంధవరపు మురళీకృష్ణ, కుందు శ్రీనివాస్, ఉంగ కోటేశ్వరరావు, అంధవరపు నవీన్, నమ్మి శంకర్, పేరాడ యోగేశ్వరరావు, శైని ప్రసాద్ బ్రహ్మ, లక్కోజి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా ర్యాంకర్‌కు సత్కారం



తల్లిదండ్రులతో కలిసి సత్కారం పొందుతున్న నవీన్

ఇచ్ఛాపురం రూరల్: ఇటీవల విడుదలైన గేట్ ఎంట్రన్స్ పరీక్ష ఫలితాల్లో ఆల్ ఇండియా స్థాయిలో 14వ ర్యాంకు సాధించిన మత్రి నవీన్‌ను పూర్వ ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు సోమవారం ఘనంగా సత్కరించారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామం స్వర్ణాపురం గ్రామానికి చెందిన నవీన్ 1వ తరగతి నుంచి పదో తరగతి వరకు డొంకూరు ఉన్నత పాఠశాలలో చదివాడు. పదిలో 9.8 పాయింట్లు సాధించి నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సంపాదించి, బీటెక్ పూర్తి చేసి ఇప్పుడు గేట్‌లో ఆల్ ఇండియా ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ తాను ఒడిశా గ్రామంలో పుట్టినా, పెరిగింది, విద్య నేర్చింది ఆంధ్రాలోనే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన పూర్తిస్థాయి సహాయంతో ఈ విజయం సాధించానని తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.వి.ఆర్‌ఎస్ ప్రసాదరావు పాల్గొన్నారు.

రహదారుల పరిశీలన

సోంపేట: పట్టణంలోని గాంధీనగర్ వెళ్లే ప్రధాన రహదారి నుంచి వీధిలోకి వెళ్లే రహదారులను జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు తడక జోగారావులు సోమవారం పరిశీలించారు. రహదారి అధ్వానంగా ఉండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



కోటబొమ్మాళి: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు



కవిటి: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

కవిటి: మండలంలోని మాణిక్యపురం పంచాయతీలో పీఏసీఎస్ చైర్మన్ దేవరాజ్ సాహు, సర్పంచ్ లలితా సాహు, ఎంపీటీసీ సత్యవతి సాహుల ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మండల మహిళా సమాఖ్య సభ్యులు సోమవారం క్షీరాభిషేకం నిర్వహించారు. వరుసగా మూడో విడత వైఎస్సార్ ఆసరా పథకం నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కోటబొమ్మాళి: మండలంలోని పలు గ్రామాల్లో మూడో విడత ఆసరా సదస్సులు నిర్వహించారు. నారాయణవలస, నీలంపేట, జర్జంగి, రేగులపాడు, తాటిపర్తి, ఎత్తురాళ్లపాడు గ్రామాల్లో డ్వాక్రా మహిళలతో అవగాహనా సదస్సులు ఏపీఎం కెల్లి రాము ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమంలో సీసీలు బిర్లంగి రామకృష్ణ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో మంగళవారం సాయంత్రం నిర్వహించే మండల స్థాయి వైఎస్సార్ ఆసరా సంబరాలను విజయవంతం చేయాలని ఏపీఎం ప్రసాదరావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

'చిరుధాన్యాలు సాగు చేయాలి'



రైతులకు ఊదలు అందజేస్తున్న దృశ్యం

మందస: రైతులు చిరుధాన్యాల పంటలను సాగు చేయాలని ఎంపీపీ డొక్కరి దానయ్య, వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ సనపల కామేశ్వరరావు సూచించారు. మండలంలోని బాలిగాం పీఏసీఎస్‌లో ప్రపంచ చిరుధాన్యాల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత యాంత్రిక ప్రపంచంలో చిరుధాన్యాలు మనిషి ఆరోగ్యానికి మేలు చేస్తున్నాయన్నారు. అతితక్కువ వ్యయంతో పాటు నీటి వినియోగం తక్కువగా ఉండే మిలెట్స్‌ను రైతులు పండించాలన్నారు. అనంతరం రైతులకు ఊదలు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి జి.నాగరాజు, ఎంపీటీసీ వాయలపల్లి మాధవరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మార్పు కృష్ణమూర్తి, వ్యవసాయ విస్తరణాధికారి బల్లు జగ్గారావు, వీఏఏ, వీహెచ్ఏలు పావని, శేఖర్, బాలరాజు, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పునః ప్రారంభంపై సమావేశం



మాట్లాడుతున్న ఎంఈవో శివరాంప్రసాద్

కంచిలి: మండలంలోని బొగాబెణి పంచాయతీ పరిధి ఎస్.బొనమాళి, యు.బొనమాళి గ్రామాలకు చెందిన బొనమాళి ప్రాథమిక పాఠశాలను విద్యార్థులు ఎక్కువ మంది లేరనే కారణంతో కొన్నేళ్ల క్రితం రద్దు చేశారు. దీంతో రద్దు చేసిన పాఠశాలను పున: ప్రారంభించాలని స్థానిక సర్పంచ్ గణప సింహాచలం, మిగతా గ్రామస్తులు జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్‌లను కోరారు. వీరు పాఠశాలను పున: ప్రారంభించాలని ప్రభుత్వానికి విన్నవించడంతో, వాస్తవ పరిస్థితిపై నివేదిక పంపాలని స్థానిక మండల విద్యాశాఖకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. దీంతో మండల విద్యాశాఖాధికారి ఎస్.శివరాంప్రసాద్ పాఠశాల పరిధిలోని రెండు గ్రామాల ప్రజలతో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. సమావేశంలో సర్పంచ్ గణప సింహాచలం, ఎస్ఆర్పీలు ఢిల్లీరావు, శ్రీనివాసరావు, మండల కో-ఆర్డినేటర్ రాము తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటితో ఇబ్బందులు



కేటీ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు



18వ వార్డు రోటరీనగర్‌లో...

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి పలు ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎక్కడికక్కడ నీరు నిలిచి ఇబ్బందికరంగా మారింది. వాహనదారులు, పాదచారులు, విద్యార్థుల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. పాత జాతీయ రహదారి, కేటీ రోడ్డు, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ తదితర ప్రాంతాల్లో ఇదే పరిస్థితి కనపడుతోంది. మున్సిపల్ శానిటేషన్ అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సంక్షిప్తంగా...

అన్నివర్గాలకు సమన్యాయం

ఇచ్ఛాపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నివర్గాలకు సమన్యాయం చేస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అన్నారు. దళిత క్రిస్టియన్లను ఎస్సీ జాబితాలోకి చేర్చాలని ఇటీవల అసెంబ్లీలో తీర్మానం చేయడంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్ అధ్వర్యంలో సోమవారం క్షీరాభిషేకం చేశారు.

ద్విచక్ర వాహనాల వేలంపాట నేడు

కాశీబుగ్గ: పలాస స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం రెండు ద్విచక్ర వాహనాలకు వేలంపాట నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి సీఐ కె.కృష్ణారావు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తి ఉన్నవారు వేలంపాటలో పాల్గొనేందుకు ఆధార్ కార్డు జిరాక్స్, రూ.1000 నగదు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఉదయం 11 గంటలకు వేలంపాట నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

ఆక్రమణలు గుర్తింపు



స్థానికులతో మాట్లాడుతున్న తహసీల్దార్ హైమావతి

కంచిలి: మండలంలోని కుత్తుం గ్రామంలో సర్వే నంబర్ 18లో ఉన్న చెరువు పోరంబోకు స్థలాన్ని గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఆక్రమించడంపై తహసీల్దార్ ఎస్.హైమావతి రెవెన్యూ సిబ్బందితో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సర్వే నంబర్ పరిధిలో 17.19 ఎకరాల స్థలాన్ని ఆక్రమించినట్లు గుర్తించారు. చెరువులో జాతీయ ఉపాధి హామీ పనులు చేపట్టగా సంబంధిత వ్యక్తి అడ్డుకోవడంతో అసలు విషయం బయటపడిందన్నారు. సహజ సిద్ధమైన చెరువులు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

కంచిలి: మండలంలోని బొగాబెణి పంచాయతీ పరిధి సామంత బొనమాళి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి సోమవారం బోరు తవ్వించారు. మండల పరిషత్ నిధుల నుంచి రూ.2.40 లక్షలు మంజూరవ్వడంతో పనులు ప్రారంభించినట్లు సర్పంచ్ గణప సింహాచలం తెలియజేశారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో అభివృద్ధి

కాశీబుగ్గ: వైఎస్సార్‌సీపీ హయాంలో మున్సిపాలిటీ అభివృద్ధి చెందిందని 12వ వార్డు కౌన్సిలర్ పోతనపల్లి ఉమాకుమారి అన్నారు. స్థానిక పల్లివీధిలో చేపట్టిన కమ్యూనిటీ భవన నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పోతనపల్లి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలు అందజేత

పలాస: మండలంలోని రైతులకు స్థానిక పీఏసీఎస్‌లో అధ్యక్షుడు పైల చిట్టిబాబు సోమవారం వ్యవసాయ రుణాలను అందజేశారు. రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఈవో శ్రీనివాసరావు, బొడ్డపాడు సర్పంచి తామాడ మధన్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ సేవలు విస్తృతం చేయాలి

ఇచ్ఛాపురం: రోటరీ క్లబ్ సేవలు విస్తృతం చేయాలని రోటరీ క్లబ్ ఇంటరాక్ట్ క్లబ్‌ల కో-ఆర్డినేటర్లు అన్నారు. స్థానిక రోటరీ ఫంక్షన్ హాల్‌లో రోటరీ ఇంటరాక్ట్ క్లబ్‌లతో సమావేశం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్లు వేదవ్యాస్, జీవన్‌జ్యోతి, వి.రత్నశ్రీ, రోటేరియన్లు నవీన్ కుమార్, డి.త్రినాథ్‌రెడ్డి, ఎంజీ రమణ, కృష్ణమూర్తి, ప్రఫుల్ పండా, వి.సురేష్, పాక తులసీదాస్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

'లక్ష్యాలను చేరుకోవాలి'

మందస: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఆధార్ కార్డుల అప్‌డేట్ లక్ష్యాలను చేరుకోవాలని ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు ఆదేశించారు. మండలంలోని పలు ఆధార్ అప్‌డేట్ కేంద్రాలను సోమవారం పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో సిబ్బందితో మాట్లాడుతూ 19 కేంద్రాల్లో ఈ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. సిబ్బంది శతశాతం లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. ప్రజలు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ

టెక్కలి: మండలంలోని తలగాం ఎట్ నౌపడ ఆర్ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు బిగ్ హెల్ప్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. బిగ్ హెల్ప్ సంస్థ చైర్మన్ ఎన్.కృష్ణారావు, డైరెక్టర్ ఆర్.రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.